

సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న జీహెచ్ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ రాజశేఖర్‌రెడ్డి

ప్రజాసమస్యల పరిష్కారంలో ముందుంటా

ఎల్‌బీనగర్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలను పరిష్కరించడంలో ఎల్లప్పుడు ముందుంటానని జీహెచ్ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్, లింగోజిగూడ కార్పొరేటర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. లింగోజిగూడ డివిజన్ పరిధిలోని లక్ష్మీనారాయణ కాలనీలో రూ. 25లక్షలతో వేసిన సీసీ రోడ్డును ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగోజిగూడ అభివృద్ధి తన లక్ష్యమన్నారు. కాలనీలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు మొక్కలు నాటి వాటి పరిరక్షణకు సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు దేవాసి బాయ్, లలిత్‌బాయ్, కాంతి బాయ్, దయాని, ప్రవీణ్, అంబలాల్ పటేల్, కాంగ్రెస్ నాయకులు పలుసం శ్రీధర్‌గౌడ్, రాజేశ్వరి, వసంత, వాసు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జైపాల్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, రోహిత్, విష్ణు, వెంకట్, జ్యోతిరెడ్డి, కళ పాల్గొన్నారు.

కాలనీకి సిందూర్ ఎన్‌క్లేవ్ నామకరణం అభినందనీయం



సిందూర్ ఎన్‌క్లేవ్‌గా నామకరణం చేస్తూ బోర్డును ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేటర్ కొప్పుల

మన్సూరాబాద్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రదాడికి ప్రతిదాడిగా భారత సైనికులు ఆపరేషన్ సింధూర్‌తో ఉగ్రవాదులకు తగిన బుద్ధి చెప్పారని, ఈ స్ఫూర్తితో దేశభక్తిని చాటేలా ఓ కాలనీకి సిందూర్ ఎన్‌క్లేవ్ నామకరణం చేయడం అభినందనీయమని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డిలు పేర్కొన్నారు. మన్సూరాబాద్ డివిజన్ ఎల్‌పీటీ మార్కెట్‌కు సమీపంలో తొమ్మిది బ్లాకులతో కూడిన హైరైజ్ అపార్ట్‌మెంట్స్ కాలనీకి సిందూర్ ఎన్‌క్లేవ్‌గా నామకరణం చేశారు. ఈ నామకరణాన్ని వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డిలు సిందూర్ ఎన్‌క్లేవ్ వెల్ఫేర్ అసోసియేషన్(ఎస్ఈడబ్ల్యూఏ) సభ్యులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్ఈడబ్ల్యూఏ అధ్యక్షుడు అంగిరేకుల అనంతరాములు, ఉపాధ్యక్షుడు కారెడ్డి ఉమామహేశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జంపర్తి విజయసారధి, ఇతర సభ్యు లు, బీజేపీ మన్సూరాబాద్ అధ్యక్షుడు హరీష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇబ్బందులు తలెత్తకుండా రోడ్ల నిర్మాణం

మన్సూరాబాద్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలోని వాహనదారులు, పాదచారులకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ప్రతీచోటా బీటీ, సీసీ రో డ్లను నిర్మిస్తున్నామని నాగోల్ కార్పొరేటర్ చింతల అరుణాసురేంద్రనాథ్ యా దవ్ పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని ఇంద్రప్రస్థకాలనీ రోడ్డు నం.5/1ఏలో రూ. 15లక్షలు, సాయిసుప్రభాత్ కాలనీలో రూ.18లక్షలతో నూతనంగా చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఆమె సోమవారం ప్రారంభించారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేంద్రనాథ్‌యాదవ్, కాలనీల సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులకు దాతల సాయం అభినందనీయం

మన్సూరాబాద్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలకు, అందులో చదివే విద్యార్థులకు తమవంతుగా ముందుకు వచ్చి దాతలు చేస్తున్న సాయం అభినందనీయమని ఉప్పల మండల విద్యాధికారి రామారావు కొనియాడారు. నాగోల్ డివిజన్ జైపురికాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు దాతల ద్వారా ఉచితంగా అందించిన టై, బెల్ట్స్, గుర్తింపు కార్డులను సోమవారం ఎంఈఓ అమ్మ ఆదర్శపాఠశాల కమిటీ చైర్‌పర్సన్ వరలక్ష్మి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బత్తుల శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి విద్యార్థులకు పంపి ణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనంతరెడ్డి, మేరీ బ్యూల, గాయత్రి, రాజేశ్వరి, రమాదేవి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వరదనీటి నాలాకు సీవరేజ్‌ని కలిపితే కఠిన చర్యలు

మన్సూరాబాద్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): వరదనీటి నాలాకు సీవరేజ్ కనెక్షన్ ఇస్తే కఠిన చర్యలుంటాయని కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి హెచ్చరించారు. డివిజన్ పరిధిలోని జడ్జెస్‌కాలనీ ఫేజ్-1, సహారా స్టేట్స్, హిమపురికాలనీ ఫేజ్-2 మీదుగా చేపట్టిన వరదనీటి నాలా పనులను కార్పొరేటర్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన్సూరాబాద్ పరిశుభ్రతకు విధిగా ప్రతి ఒక్కరూ పాటుపడాలని అన్నారు. కార్యక్రమంలో పరిసర కాలనీల అసోసియేషన్ సభ్యులు సయ్యద్ జానీ, కత్తుల రాంబాబు, శోభన్‌బాబు, మధుసూదన్‌రెడ్డి, కిరణ్, అజయ్, చంద్రశేఖర్, కిశోర్ పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికులకు పీపీఈ కిట్లను అందజేస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

పారిశుధ్య కార్మికులకు పీపీఈ కిట్ల పంపిణీ

వనస్థలిపురం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు కృషి చేసే పీపీఈ కిట్లను సద్వినియోగం చేసుకోవాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. సోమవారం బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సాహెబ్‌నగర్ ఫంక్షన్‌హాల్లో పారిశుధ్య కార్మికులకు పీపీఈ కిట్లను కార్పొరేటర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న పీపీఈ కిట్లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శానిటేషన్ డీఈ నీలిమ, ఎస్.ఎస్ అజీమ్, జవాన్ యాదయ్య, కాలనీవాసులు నందకిషోర్, శశికాంత్, చిత్రంజన్ పాల్గొన్నారు.

బీసీ కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మించాలి : శ్రీవాణి



స్థానికులతో కలిసి పాత కోర్టు కాంప్లెక్స్ స్థలాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీవాణిఅంజన్

ఎల్‌బీనగర్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): కొత్తపేట చౌరస్తాలోని రంగారెడ్డి జిల్లా కోర్టుల పాత కాంప్లెక్స్ స్థలంలో బీసీ కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మించాలని కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానికులతో క లిసి ఆ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హుడా కాం ప్లెక్స్‌లోని పాత కోర్టు కాంప్లెక్స్ స్థలాన్ని హెచ్ఎండీఏ నుంచి ప్రభుత్వం స్వాధీనం చేసుకుని అక్కడ బీసీల కోసం కమర్షియల్ కాంప్లెక్స్‌గా అభివృద్ధి చేయాలని కోరారు. బీజేపీ సరూర్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, మాజీ అధ్యక్షుడు గోవర్ధన్, జైన్‌బాబు, కబీర్‌దాస్, దేవేందర్ ముదిరాజ్, రాజు పాల్గొన్నారు.

క్లస్టర్ లెవల్ స్పోర్ట్స్‌లో బీపీడీఏవీ విద్యార్థుల ప్రతిభ

చంపాపేట, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): కంచన్‌బాగ్ మిధానీ టౌన్‌షిప్‌లోని బీపీడీఏవీ విద్యార్థులు బానూర్‌లో ఈనెల 2,3న నిర్వహించిన క్లస్టర్ లెవల్ స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొని యోగా, చెస్, హ్యాండ్‌బాల్, టేబుల్‌టెన్నిస్, కరాటే, అథ్లెటిక్స్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ చాటి షీల్డ్స్, మెడల్స్ పొందినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ వివిఎ.ప్రశాంత్ తెలిపారు. పాఠశాలలో సోమవారం విద్యార్థులకు అభినందన సభను నిర్వహించారు. అండర్-14,17 బాలికల విభాగంలో యోగా, కరాటే, రిలే పోటీల్లో ప్రథమ స్థానం, అండర్-14 బాలబాలికల విభాగంలో నెట్‌బాల్, అండర్-17బాలుర విభాగంలో హ్యాండ్‌బాల్, రిలే పోటీల్లో ప్రథమ స్థానం పొందినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. అండర్-17 బాలికల విభాగంలో 1500, 400, 100మీటర్ల పరుగుపందెం పోటీల్లో ప్రథమ స్థానం సాధించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ కె.మధుబాల, డీఏవీ పాఠశాల ఏఆర్ఓ ఆనందవల్లి, ప్రిన్సిపాల్ ప్రశాంత్, బీడీఎల్, మిధానీ ఎల్ఎంసీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దంచికొట్టిన వర్షం.. జలమయమైన రోడ్లు

చాదర్‌ఘాట్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మలక్‌పేట్ పరిసర ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం వర్షం దంచికొట్టడంతో మలక్‌పేటలోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. లోతట్టుగా ఉన్న న్యూమార్కెట్ మెట్రోస్టేషన్ కింద ఉన్న జాతీయ రహదారిని ఒక్క మారుగా వరద ప్రవాహం ముంచెత్తడంతో ఇటు వాహనదారులతో పాటు పాదచారులు తీవ్ర ఇక్కట్లకు లోనయ్యారు. వరదను తగ్గుముఖం పట్టించేందుకు మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్‌తో పాటు ట్రాఫిక్ సిబ్బంది చర్యలు చేపట్టారు. మార్కెట్ ముందున్న మ్యాన్‌హోల్ మూతలను తెరవడంతో ఒక్కమారుగా వరద తగ్గుముఖం పట్టింది. అదేవిధంగా మూసారాంబాగ్ బ్రిడ్జిని కూడా వరద ప్రవాహం ముంచెత్తడంతో వాహనదారులు పడరాని పాట్లు పడ్డారు.



మూసారాంబాగ్ బ్రిడ్జిని ముంచెత్తిన వరద ప్రవాహం



కామినేని చౌరస్తా నుంచి సహారా స్టేట్స్ వెళ్లే రోడ్డుపై ప్రవహిస్తున్న వరదనీరులో ఇబ్బందికరంగా రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు

నాగోల్, మన్సూరాబాద్‌లలో..

మన్సూరాబాద్: నాగోల్, మన్సూరాబాద్ డివిజన్లలో సోమవారం వర్షం దంచికొట్టింది. దీంతో అదే సమయంలో పాఠశాల వదిలేయడంతో విద్యార్థులు, వివిధ పనుల నిమిత్తం ప్రజలు వర్షంలో రాకపోకలు సాగించడంలో ఇబ్బందులు పడ్డారు. మన్సూరాబాద్‌లోని కామినేని చౌరస్తా నుంచి సహారా స్టేట్స్, నాగోల్ ఆనంద్‌నగర్ చౌరస్తా నుంచి సౌత్‌ఎండ్‌పార్కు వెళ్లే ప్రధానరోడ్డు మార్గాలతో పాటు నాగోల్ చౌరస్తా వద్ద భారీగా వరదనీరు వచ్చి చేరడంతో రాకపోకల్లో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

గ్రామాల అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం పెద్దపీట: ఎమ్మెల్యే రంగారెడ్డి

- శివారు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పదేళ్ల అధికారంలో ఉన్న టీఆర్ఎస్ గ్రామాల అభివృద్ధిని పట్టించుకోలేదని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి విమర్శించారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని అనాజ్‌పూర్, మజీద్‌పూర్, గంతపల్లి గ్రామాల్లో రూ. 80లక్షలతో చేపట్టిన, చేపట్టనున్న సీసీ, యూజీడీ, కమ్యూనిటీ, అంగన్‌వాడీ భవనాలకు రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డితో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా అనాజ్‌పూర్‌లో గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు ఎమ్మెల్యే మల్‌రెడ్డికి ఘన స్వాగతం పలికారు. ముందుగా గ్రామంలో నూతనంగా నిర్మించిన ఏడు తలకాయల మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం వనమహోత్సవంలో భాగంగా మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం మూలంగా గ్రామాలు అభివృద్ధికి దూరమయ్యాయని అన్నారు. గ్రామాల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులను కేటాయిస్తూ అభివృద్ధి వైపు నడిపిస్తున్నామని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. రాష్ట్ర ప్రజల అభివృద్ధే ప్రజా పాలన లక్ష్యం అన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి, వైస్ చైర్మన్ భాస్కరాచారి, మాజీ జడ్పీటీసీ బింగి దేవదాసుగౌడ్, గుంతపల్లి మాజీ సర్పంచ్ వెంకటేష్‌కరిమెల, నరేందర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, నార్లకొండ శ్రీశైలంయాదవ్, కాటేంకార్ రమేష్ పాల్గొన్నారు.



అనాజ్‌పూర్‌లో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే రంగారెడ్డి, పక్కన కార్పొరేషన్ చైర్మన్లు రాంరెడ్డి, మధుసూదన్‌రెడ్డి

రామాలయ పునర్నిర్మాణ పనులకు అడ్డురావొద్దు : సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): నాగోల్ బండ్లగూడలో రామాలయ పునర్నిర్మాణ పనులను ప్రైవేటు వ్యక్తులు అడ్డుకోవాలని చూస్తే కఠిన చర్యలు తప్పవని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి హెచ్చరించారు. ఆలయ పునర్నిర్మాణపనులు చేపడుతుంటే పక్కనే ఉన్న ఓ ప్రైవేటు వ్యక్తి ఆలయం మధ్యలోంచి దారి వదలాలంటూ పలు రకాలుగా ఇబ్బందులు పెడుతున్నాడని ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వారి విన్నపం మేరకు సోమవారం జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి ఆ ప్రాంతాన్ని సందర్శించారు. అందుకు సంబంధించిన పత్రాలను పరిశీలించిన అధికారులు ప్రైవేటు వ్యక్తి వద్ద ఉన్న పత్రాలు నకిలీవిగా తేల్చిచెప్పారు. అదేవిధంగా ఇటీవల రజక, హిందూ శ్మశానవాటిక వద్ద గల సుమారు వంద గజాల స్థలం కబ్జా చేసి చేపట్టిన నిర్మాణాలను అధికారులు కూల్చివేయగా మళ్లీ ఇదే వ్యక్తులు కబ్జాకు యత్నిస్తున్నారని బండ్లగూడ గ్రామస్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలు కబ్జాకు పాల్పడితే చూస్తూ ఊరుకోమని, కబ్జా చేయకుండా అట్టి స్థలంలో వెంటనే ప్రహరీ నిర్మించాలని అధికారులకు సూచించారు. ఆలయ కమిటీ సభ్యులు ఎలాంటి రోడ్డుకు స్థలం వదలకుండా నిర్భయంగా రామాలయ పునర్నిర్మాణ పనులు చేపట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హయత్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వంశీకృష్ణ, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ విజయలక్ష్మి, బీఆర్ఎస్ నాగోల్ డివిజన్ అధ్యక్షుడు తూర్పాటి చిరంజీవి, సీనియర్ నాయకులు అనంతుల రాజిరెడ్డి, చెరుకు ప్రశాంత్‌గౌడ్, నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలు ఇస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఘనంగా జక్కిడి రఘువీర్‌రెడ్డి జన్మదిన వేడుకలు

మన్సూరాబాద్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ మన్సూరాబాద్ డివిజన్ యువ నాయకుడు జక్కిడి రఘువీర్‌రెడ్డి జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఉదయాన్నే కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేసిన రఘువీర్‌రెడ్డి నేరుగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని కలిసి ఆయన ఆశీర్వచనం పొందారు. అనంతరం ఆయన నివాసం వద్ద ఏర్పాటు చేసిన వేదికపై బీఆర్ఎస్ నాయకులు, యువకులు, స్నేహితులు, అభిమానులు రఘువీర్‌రెడ్డిని శాలువాలు, పుష్పగుచ్ఛాలు, జ్ఞాపికలు అందజేసి ఆయనచే కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వేదిక వద్ద గంటా సతీష్, ఉంద్రాతి రవిల బీమా ఫౌండేషన్ ఆధ్వర్యంలో తలసేమియా చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన శిబిరంలో పలువురు రక్తదానం చేయగా వారిని అభినందించిన రఘువీర్‌రెడ్డి సర్టిఫికేట్లను అందజేశారు. అదేవిధంగా గంటా సతీష్, సాయిగౌడ్, విజయ్‌భాస్కర్‌రెడ్డి, శివశంకర్‌గౌడ్, పాతూరి త్రిలోక్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ పారిశుధ్య మహిళా కార్మికులకు చీరలు, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు టై, బెల్టుల పంపిణీ, స్పందన ఓల్డేజ్ హోమ్‌లో వృద్ధులకు అన్నదానం, అమ్మ చేయూత ఫౌండేషన్‌లో అన్నదానం, నిత్యావసరాల పంపిణీ వంటి సేవా కార్యక్రమాలను చేపట్టారు. తమ నాయకులు కేసీఆర్, కేటీఆర్ స్ఫూర్తితో ఎమ్మెల్యే సూచనలతో నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధికి పాటుపడతానని జక్కిడి రఘువీర్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మన్సూరాబాద్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



విద్యార్థుల నడుమ జన్మదిన కేక్‌ను కట్ చేస్తున్న రఘువీర్‌రెడ్డి

రోడ్డుకు అడ్డంగా ఉన్న విగ్రహాలను తొలగిద్దాం: మల్‌రెడ్డి రాంరెడ్డి

హయత్‌నగర్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): రోడ్డుకు అడ్డంగా ఉన్న నేతల విగ్రహాలను తొలగించి జాతీయ రోడ్డు విస్తరణకు అందరు సహకరించాలని రాష్ట్ర రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. సోమవారం హయత్‌నగర్ మండల పరిషత్ కార్యాలయంలో విగ్రహ సంఘాల ప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు, పోలీసులతో కలిసి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం రోడ్డు విస్తరణకు పూనుకుందన్నారు. అందులో భాగంగా ఎల్బీనగర్ మొదలుకుని హయత్‌నగర్ వరకు రోడ్డుపైన ఉన్న విగ్రహాలను, ఇతర నిర్మాణాలను తొలగించాలని కోరారు. దీనికి అందరు సహకరించాలని కోరారు. జాతీయ నాయకుల విగ్రహాల ఏర్పాటుకు ప్రత్యామ్నాయ మార్గాలను చూద్దాం అని పేర్కొన్నారు. పెద్దఅంబర్‌పేట్ ఔటర్ రింగు రోడ్డు నుంచి ఎల్బీనగర్ వరకు విపరీతమైన ట్రాఫిక్ ఉంటుందని తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణకు రోడ్లను విస్తరించాల్సిందేనని అన్నారు. కార్యక్రమంలో అబ్దుల్లాపూర్‌మెట్ ఎంపీడీవో శ్రీవాణి, డీఈఈ గుర్రం ఇంద్రసేనారెడ్డి, సీఐలు నాగరాజుగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గజ్జి భాస్కర్‌యాదవ్, గుర్రం శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ హయత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు చెన్నగోని రవీందర్‌గౌడ్, అనీల్‌కుమార్‌రెడ్డి, అంబేడ్కర్ సంఘం నాయకులు పారంద స్వామి, ఎర్ర రవీందర్, మురళీ, యాదయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి

యువకుడి అదృశ్యం

మన్సూరాబాద్: అద్దె గది నుంచి బయటకు వెళ్లిన తండ్రీకొడుకుల్లో తండ్రి అదృశ్యమైన ఘటన నాగోల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ ఎండీ మక్బూల్ జానీ, బాధితుల వివరాల ప్రకారం.. జార్ఖండ్‌కు చెందిన సోహ్రాయ్ ఓరాన్(32), మంజయ్ ఓరాన్‌లు తండ్రీకొడుకులు. జీవనోపాధి కోసం సోహ్రాయ్ ఓరాన్ బావ మఖన్ ఓరాన్‌తో కలిసి వీరిద్దరు జార్ఖండ్ నుంచి హైదరాబాద్‌కు శుక్రవారం వచ్చారు. ముగ్గురు నాగోల్ జైపురికాలనీలోని ఓ అద్దె గదిని విశ్రాంతి నిమిత్తం తీసుకున్నారు. ఈ క్రమంలో తండ్రీకొడుకులు బయటకు వెళ్లారు. కొంత సమయం తర్వాత మంజయ్ ఓరాన్ ఒక్కడు మాత్రమే గదికి తిరిగి వచ్చారు. దీంతో మఖన్ ఓరాన్ తన అల్లుడిని 'నీ తండ్రి సోహ్రాయ్ ఓరాన్ ఎక్కడ'ని అడగగా జైపురి కాలనీ ఆటోస్టాండ్ వద్ద తప్పిపోయాడంటూ సమాధానం ఇచ్చారు. వెంటనే ఇద్దరూ కలిసి పరిసర ప్రాంతాలు, స్నేహితులు, బంధువులను ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. దీంతో సోమవారం నాగోల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

స్థానికులకే లెనిన్‌నగర్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు : కేఎల్లార్



కేఎల్లార్‌తో మీర్‌పేట్ లెనిన్‌నగర్‌వాసులు

సరూర్‌నగర్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): బాలాపూర్ మండలం మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని లెనిన్‌నగర్‌లో నిర్మిస్తున్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల ను స్థానికులకే కేటాయించేలా చర్యలు తీసుకుంటామని, స్థానికేతరులకు స్థానం కల్పించబోమని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి స్పష్టం చే శారు. సోమవారం లెనిన్‌నగర్, మీర్‌పేట్, జిల్లెలగూడ తదితర ప్రాంతాలకు చెందిన పలువురు మహిళలు కేఎల్లార్‌ను ఆయన కార్యాలయంలో కలిసి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను స్థానికులకే కేటాయించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కేఎల్లార్ మాట్లాడుతూ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులో అవకతవకలకు తావు లేకుండా చూస్తామని, స్థానికులకు కచ్చితంగా న్యాయం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నేడు రేషన్ కార్డుల పంపిణీ

మహేశ్వరం నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన కొత్త రేషన్ కార్డులను మంగళవారం బాలాపూర్‌లోని మల్లాపూర్ సమీపంలో గల వైఏఆర్ కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసే కార్యక్రమంలో పంపిణీ చేయనున్నట్టు కేఎల్లార్ వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు ముఖ్య అతిథిగా హాజరై కార్డులు అందజేస్తారని ఆయన చెప్పారు. సోమవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి వైఏఆర్ కన్వెన్షన్‌ను సందర్శించి మంగళవారం నాటి కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు యెల్మేటి అమరేందర్‌రెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి, అందుగుల సత్యనారాయణ, బిజంగయ్య, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గ అధ్యక్షుడు వల్లపు సుభాన్‌యాదవ్, జహంగీర్, మనోహర్, రవి, భానుప్రసాద్, భాస్కర్ పాల్గొన్నారు.



కరణ్‌బాగ్‌కాలనీ సమావేశంలో ఎమ్మెల్యే బలాల, కార్పొరేటర్ అరుణారెడ్డి

ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

- అధికారులకు ఎమ్మెల్యే బలాల సూచన

సైదాబాద్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): కాలనీలు, బస్తీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అధికారులకు సూచించారు. సోమవారం సైదాబాద్ డివిజన్ కరణ్‌బాగ్ కాలనీలో కార్పొరేటర్ కొత్తకాపు అరుణారెడ్డి, వివిధ శాఖల అధికారులతో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. అనంతరం కాలనీ పార్కులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ అలీ, ఏఈ వెంకన్న, జలమండలి డీజీఎం హస్మత్‌అలీ, మేనేజర్ శ్రవణ్‌కుమార్, సూపర్‌వైజర్లు మనోహర్, శ్రీనివాస్, కాలనీ అధ్యక్షుడు శ్రీకరం శ్రీనివాస్(మాల్యాద్రి), కార్యదర్శి సుదర్శన్ ప్రతినిధులు సాయి, త్రిమూర్తి, యుగెందర్, రవిచారి, ఉస్మాన్, జలీల్, సుస్మిత పాల్గొన్నారు.



సేవాదళ్ శ్రేణులతో కలిసి ఢిల్లీకి బయలుదేరుతున్న జితేందర్

బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలి: జితేందర్

చంపాపేట, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని టీపీసీ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు మిద్దెల జితేందర్ అన్నారు. సోమవారం సేవాదళ్, కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి మిద్దెల జితేందర్ చర్లపల్లి రైల్వేస్టేషన్ నుంచి ఢిల్లీకి బయలుదేరారు. ఈ సందర్భంగా కర్మన్‌ఘాట్‌లోని సేవాదళ్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ బీసీ వర్గాల అభివృద్ధికి రిజర్వేషన్లు కీలకం అని అన్నారు. దేశంలో అధిక శాతం ఉన్న బీసీలకు న్యాయం దక్కడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ జనాభాకు అనుగుణంగా తగిన రాజకీయ, విద్యా, ఉద్యోగ అవకాశాలు రావడం లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి బీసీలకు 42శాతం రిజర్వేషన్లు సాధించేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సేవాదళ్ ప్రతినిధులు వాజిద్‌మైక్, బండి సురేందర్, సంపత్‌కుమార్‌గౌడ్, అబుబాకర్, ఫసియోద్దీన్, ఆయా జిల్లాల సేవాదళ్ ప్రతినిధులు, బీసీ సంఘాల నేతలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల భవనాల నిర్మాణం పూర్తిచేయాలి

సరూర్‌నగర్ : బాలాపూర్ మండలంలోని బడంగ్‌పేట్, మీర్‌పేట్ లెనిన్‌నగర్‌లలో గతేడాది చేపట్టిన పాఠశాలల నూతన భవనాల నిర్మాణం పనులను తొందరగా పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరమ్(సీఆర్‌పీఎఫ్) ప్రతినిధులు విద్యాశాఖాధికారులను కోరారు. ఈ మేరకు సోమవారం ఫోర మ్ ప్రతినిధులు డీఈవోను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడంగ్‌పేట్, లెనిన్‌నగర్ పాఠశాలల భవనాల నిర్మాణం ఈ విద్యాసంవత్సరంలోనే పూర్తి చేయాల్సి ఉండగా ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల జాప్యం జరుగుతున్నదని ఆరోపించారు. చాలీచాలని తరగతి గదుల్లో విద్యాబోధన జరుగుతుండడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి సదరు భవనాల నిర్మాణం పనులను వేగవంతం చేయించి తొందరగా అందుబాటులోకి తీసుకురావాలని వారు కోరారు. ఫోరమ్ ప్రతినిధులు వెంకట్‌స్వామి, ముకుందం, నరేందర్, భీమేశ్ పాల్గొన్నారు.

మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తిరుపతి

సైదాబాద్, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మలక్‌పేట బీబ్లాక్ కాలనీకి చెందిన ఇందూరి తిరుపతి నియమితులయ్యారు. ఈ మేరకు నియామకపత్రాన్ని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పురుషోత్తంరావు అందజేశారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ మున్నూరుకాపుల సంక్షేమం, ఐక్యతకు కృషిచేస్తానని తెలిపారు.

లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదు

కొత్తపేట, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): చట్టబద్ధంగా తగిన లైసెన్సు పొందకుండా వాహనాలు నడపరాదని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) అధికారులు, ఇన్‌స్పెక్టర్ రాచపుడి సూచించారు. సోమవారం రాచకొండ పరిధిలోని రామాంతపూర్‌లో జడ్‌పీహెచ్ఎస్, యూపీఎస్, 4 ప్రైవేటు విద్యాసంస్థల్లో ఉప్పల్‌లో రెండు ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు బజాజ్ సర్వీస్ సెంటర్‌లో ఉద్యోగులకు ఎస్ఐ నర్సింహారావు, ఆర్ఎస్ఐ సంతోష్‌కుమార్, ఏఎస్ఐ సోమ్‌నాథ్, సిబ్బంది రమేష్ రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనల ప్రాధాన్యతలపై అవగాహన కల్పించారు. ప్రమాదాల నివారణకు మద్యం మత్తులో వాహనాలు నడపరాదని, నిబంధనలకు అనుగుణంగా వాహనాలు నడపాలని అన్నారు. ఈ ప్రాంతాల్లో వారు 17 అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

101 మంది మద్యంప్రియులకు డీడీ కౌన్సిలింగ్

రాచకొండ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ వాహనాల తనిఖీల్లో పట్టుబడిన 101 మంది మద్యంప్రియులకు 101 మంది కుటుంబ సభ్యుల సమక్షంలో రాచకొండ పిల్లల ట్రాఫిక్ శిక్షణ పార్కు లెక్చర్ హాల్‌లో ఇన్‌స్పెక్టర్ రాచపుడి, ఇన్‌స్పెక్టర్ ఎస్‌పీఓ అమరవర్ధన్‌రెడ్డి కౌన్సిలింగ్ నిర్వహించారు.

పోక్సో కేసులో నిందితుడికి జైలు, జరిమానా

రంగారెడ్డి జిల్లా కోర్టులు : పోక్సో కేసులో నిందితుడికి 10 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.20వేలు జరిమానా విధిస్తు రంగారెడ్డి జిల్లా పోక్సో కోర్టు న్యాయమూర్తి పద్మావతి తీర్పుచెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ శోభారాణి కథనం ప్రకారం పలివెల బాబా ఎలియాస్ పాండు ఒక బాలికపై లైంగికదాడికి పాల్పడ్డాడు. బాలిక సంబంధికులు పో లీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితుడిని అరెస్టుచేసి కోర్టులో హాజరుపరిచారు. విచారణ అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా కేసు పూర్వాపరాలు పరిశీలించిన పోక్సోకోర్టు న్యాయమూర్తి నిందితుడికి 10 సంవత్సరాల జైలుశిక్షతో పాటు రూ.20వేలు జరిమానా విధిస్తు తీర్పు చెప్పారు.

ఘనంగా ఫలహారం బండి ఊరేగింపు

ఎల్‌బీనగర్: లింగోజిగూడ, ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఫలహారం బండ్ల ఊరేగింపు సోమవారం ఘనంగా నిర్వహించారు. డప్పు వాయిద్యాలు, పోతరాజుల నృత్యాల నడుమ అమ్మవారి ఫలహారం బండ్ల ఊరేగింపు ఆర్‌కేపురంలోని వివిధ ప్రాంతాల్లో కనులపండువగా సాగింది. పలు ప్రాంతాల్లో తొట్టెల ఊరేగింపుల సందర్భంగా పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. భారీ ఊరేగింపుగా తరలిన తొట్టెలు, పోతరాజుల వీరంగాలు, శివసత్తుల పూనకాలతో ఆయా ప్రాంతాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. జోగిని అనురాధ ఆధ్వర్యంలో శివసత్తుల పూనకాలతో వెళ్తుండగా కాలనీలలో మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విజయపురికాలనీలోని మూడు గుళ్ల నుంచి బయలుదేరిన మైసమ్మ అమ్మవారి ఫలహారం బండి ఊరేగింపు టెలిఫోన్‌కాలనీ, వాసవీకాలనీ, గ్రీన్‌హిల్స్‌కాలనీ మీదుగా ఎన్‌టీఆర్‌నగర్‌లోని ఖిల్లా మైసమ్మ అమ్మవారి ఆలయం వరకు సాగింది. పోచమ్మ, ఎల్లమ్మ, మైసమ్మ అమ్మవార్ల పూజల అనంతరం ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పున్న గణేష్‌నేత, ప్రధాన కార్యదర్శి బండి మధుసూదన్‌రావుల ఆధ్వర్యంలో జరిగిన ఫలహారం బండి ఊరేగింపును టీపీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ దేప సురేఖ, పున్న నిర్మల గణేష్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి ప్రారంభించారు. బీసీ నాయకుడు గట్ల రవీంద్ర, ఖిల్లా మైసమ్మ ఆలయ చైర్మన్ సురేష్, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ రఘుపతిరెడ్డి, జిన్నారం వెంకటేశ్వర్లు, జెల్ల జగన్నాథం పాల్గొన్నారు.